క్లుప్తంగా

నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారంపై కేసు

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్ల పాడు గ్రామానికి చెందిన ఎర్రబోయిన పెద్ద పోలయ్య, అల్లూరయ్యలపై వారి పెదనాన్న కుమార్తె ఎగ్గోని పోలమ్మ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ముండ్లపాడు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 410/3 ఏ2లో ఆమెకు సంబంధించిన 1.50 ఎకరాల పొలం పత్రాలు నకిలీవి తయారు చేసి చేశారంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రెండు మట్టిలోడు ట్రాక్టర్లు సీజ్


పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మట్టి ట్రాక్టర్లు

రాచర్ల: మండలంలోని గుడిమెట్ట పెద్ద చెరువులో కొమరోలు మండలం మోటు గ్రామానికి ఇటుకల తయారీ కోసం కొంతమంది చెరువులో యంత్రాల సహాయంలో మట్టిని రాత్రి సమయంలో అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు గిద్దలూరు ఇరిగేషన్ డీఈ జయరామయ్య ఆదేశాలతో ఇరిగేషన్ జేఈ కె.విశ్వనాథం గురువారం ఉదయం 4 గంటలకు గుడిమెట్ట చెరువులో అక్రమంగా మట్టిని తీసుకెళ్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ రెండు ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తదుపరి మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ విశ్వనాథం తెలిపారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు


పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ మహ్మద్

బేస్తవారిపేట: మండలంలోని రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి జక్కం మెర్సీ అన్నారు. 50 శాతం సబ్సిడీపై పిల్లి పెసర, జీలుగ, జనుములు రైతు భరోసా కేంద్రాల వద్ద అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

అర్ధవీడు (బేస్తవారిపేట): మండలంలోని అన్నీ రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏఓ షేక్ మహ్మద్ తెలిపారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. పిల్లిపెసర కిలో రూ.67, జీలుగలు, జనుములు కిలో రూ.44 ఇవ్వనున్నట్లు చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పొలం పాస్‌పుస్తకం జిరాక్స్ తీసుకుని ఆర్‌బీకేల్లోని వీఏఏలను సంప్రదించాలని కోరారు.

దొనకొండలో ఈదురు గాలులు

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, వడగండ్లతో బీభత్సంగా వాన కురిసింది. 10 రోజుల నుంచి రెండు రోజులకు ఒక సారి వర్షం పడుతోంది. దీంతో ఎండి పోయిన కుంటలకు, వాగులకు కొద్దిమేర నీరు చేరింది. భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. రైతులు పొలాలు సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉంది.


బైకులు స్వాధీనం చేసుకున్న పోలీసులు


బుద్ధపల్లిలో వాహనాల పత్రాలను పరిశీలిస్తున్న సీఐ మల్లికార్జున్, ఎస్సైలు


మార్కాపురంలో యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

● సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరిక

మార్కాపురం టౌన్: జూన్ 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మార్కాపురం పట్టణం, గ్రామాల్లో ఎవరైనా గొడవలు, అల్లర్లు సృష్టించి లా అండ్ ఆర్డర్‌కు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం ఉదయం స్థానిక రాజ్యలక్ష్మి కాలనీలో పట్టణ ఎస్సై రెహమాన్, రూరల్ ఎస్సై నాయక్‌లతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ఆధారాలు లేని 15 వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కాలనీ వాసులతో సీఐ మాట్లాడుతూ మారణాయుధాలు, పెట్రోల్ బాంబులు, ఇతరత్రా పేలుడు పదార్థాలు కలిగి ఉంటే జైలు తప్పదని హెచ్చరించారు. ఒక్కసారి రౌడీషీట్ ఓపెన్ చేస్తే భవిష్యత్తులో చాలా ఇబ్బందులు పడతారని, యువతకు ఉద్యోగ అవకాశాలు రావని చెప్పారు. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేయవద్దని స్పష్టం చేశారు.

బుద్ధపల్లెలో కార్డన్ సెర్చ్

తర్లుపాడు: మండలంలోని బుడ్డపల్లెలో గురువారం ఉదయం పొదిలి సీఐ మల్లికార్జున ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా అలర్లు దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. తర్లుపాడు ఎస్సై వేముల సుధాకర్, పొదిలి ఎస్సై కోటయ్య, సర్కిల్ పరిధిలోని పలువురు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


కొమరోలు: బైకులను సీజ్ చేసిన గిద్దలూరు సీఐ దాసరి ప్రసాద్


కంభంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

కొంగలవీడురోడ్డులో కార్డన్ సెర్చ్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొంగలవీడురోడ్డు ఎస్టీ కాలనీ, టైలర్స్ కాలనీల్లో గురువారం స్థానిక సీఐ వైవీ సోమయ్య కార్డన్ సెర్చ్ చేశారు. కాలనీలోని గృహాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ తన సిబ్బందితో సహా కలిసి కాలనీల్లోని ప్రతి గృహాన్ని తనిఖీ చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరిస్తూ ప్రోత్సహించాలన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ చట్టాన్ని గౌరవించాలన్నారు. తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేని 4 బైక్‌లను గుర్తించి వాటిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎస్సై తోట వెంకటేశ్వర్లు, ఏఎస్సై జింకా లక్ష్మీరంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కంభం: కందులాపురం పంచాయతీ పరిధి కందులాపురం కాలనీలో గురువారం తెల్లవారు జామున కంభం సీఐ జె.రామకోటయ్య ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ చేశారు. సరైన ధృవపత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలు, ఒక కారు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పులి రాజేష్ తెలిపారు. సరైన ధృవపత్రాలు తీసుకొచ్చి వాహనాలు తీసుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు శాంతియుతంగా ఉండాలని సీఐ సూచించారు. గ్రామాల్లో ఎవరైనా ఘర్షణలకు దిగితే, ఒకరిపై ఒకరు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసుకున్నా చర్యలు తప్పవన్నారు. అర్ధవీడు ఎస్సై అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

కొమరోలు : ఎలాంటి ధృవపత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు గిద్దలూరు రూరల్ సీఐ దాసరి ప్రసాద్ తెలిపారు. మండలంలోని అల్లినగరంలో గురువారం కార్డెన్ సెర్చ్ చేశారు. ఈ సందర్భంగా గిద్దలూరు సీఐ దాసరి ప్రసాద్, కొమరోలు ఎస్సై మధుసూదన్‌రావు, పోలీసు సిబ్బంది ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. సీఐ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన జరుగనున్న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ఎవరికి అనూలకంగా ఉన్న రాజకీయ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని, ఎలాంటి అల్లర్లు సృష్టించకుండా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీడీపీ నేతల దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరు

● పెద్ద యాచవరంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా
● వైఎస్సార్ సీపీ నాయకుల స్పష్టీకరణ

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలంలోని పెద్ద యాచవరం గ్రామంలో వైఎస్సార్ సీపీకి ఓటు వేయలేదని టీడీపీ కార్యకర్తలకు నీటి సరఫరా నిలిపివేసినట్లుగా పచ్చ పత్రికల్లో వచ్చిన వార్తలు పచ్చి అబద్ధాలని గ్రామస్తులు స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం మార్కాపురంలో పెద్దయాచవరం వైఎస్సార్ సీపీ నాయకులు బూదాల ఏసురత్నం, బూదాల బెంజిమెన్, చప్పిడి జాన్సన్, బూదాల సురేష్ తదితరులు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రస్తుతం 5 బోర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోందని, ఈ విషయాన్ని మరిచి గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని వివరించారు. వాస్తవానికి ఒక స్వచ్ఛంద సంస్థ మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన బోరు ఇటీవల పాడైందని చెప్పారు. గతంలో మరమ్మతులకు గురైతే తామే బాగు చేయించి నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చేస్తున్నామన్నారు. మూడు రోజుల క్రితం మరమ్మతులకు గురైన బోరు ఫొటో పచ్చ పత్రికల్లో వేసి, వైఎస్సార్ సీపీకి ఓటు వేయనందుకు నీరు ఇవ్వలేదని రాయించి గ్రామానికే చెడ్డపేరు తేవడం సరికాదన్నారు. పక్క గ్రామాలకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారనడంలో వాస్తవం లేదన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో కొందరు టీడీపీ నాయకులు చిచ్చు పెట్టేందుకు ప్రయత్నించడం బాధాకరమన్నారు. గ్రామ ఎస్సీ కాలనీలో నీటి సరఫరా జరుగుతోందని, టీడీపీ నాయకుల ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.


మాట్లాడుతున్న గ్రామస్తులు

కొనకనమిట్ల మండలంలో మోస్తరు వర్షం


వాగుమడుగు-గనివానిపాడు రహదారిపై వర్షం నీరు

కొనకనమిట్ల: ఉపరితల ద్రోణి ప్రభావంతో గురువారం సాయంత్రం కూడా మండలంలోని గనివానిపాడు, వాగుమడుగు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. కుంటలకు నీరు చేరడంతోపాటు గనివానిపాడు నుంచి కలవలపల్లి వెళ్లే మట్టి రోడ్డు కోతకు గురైంది. వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే రహదారిపై వర్షం నీరు ప్రవహించింది. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు


మాట్లాడుతున్న ఆర్‌డీ రాహుల్‌మీనా

● సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం: జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టనున్నట్లు సబ్ కలెక్టర్, మార్కాపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాహుల్‌మీనా పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి గురువారం సబ్‌కలెక్టర్ తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థులంతా జూన్ 4న ఉదయం 6.30 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి రావాలని, వారి సమక్షంలో స్ట్రాంగ్ రూములకు వెళ్లి ఈవీఎంలను పరిశీలిస్తామన్నారు. మొత్తం 18 టేబుల్స్ ఉంటాయని, వాటిలో 14 సాధారణ ఓట్ల లెక్కింపునకు, 4 పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు కేటాయిస్తారని వివరించారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. అసెంబ్లీకి, పార్లమెంట్‌కు వేర్వేరుగా ఓట్ల లెక్కింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ అత్యంత పకడ్బందీగా భారీ బందోబస్తు మధ్య సాగుతుందని, కౌంటింగ్ ఏజెంట్లు నిర్దేశించిన సమయానికి కేంద్రానికి రావాల్సి ఉంటుందన్నారు.

పోలేరమ్మ తల్లికి పొంగళ్లు


నైవేద్యాలతో వస్తున్న భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని నాయుడుపేట గ్రామంలో గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ ఉత్సవం నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామం పచ్చగా ఉండాలని వేడుకున్నారు. గుంటూరు, ఒంగోలు, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించారు.


అలంకరణలో పోలేరమ్మతల్లి

అంగరంగ వైభవంగా వేణుగోపాలుడి కల్యాణం

యర్రగొండపాలెం: స్థానిక మిల్లంపల్లి రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం గురువారం వేకువ జామున అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వారి కల్యాణం సందర్భంగా బుధవారం నుంచి కార్యక్రమాలు ప్రారంభించారు. అంకురార్పణం, ధ్వజారోహణం, బేరీ పూజ, దేవతాహ్వానం, రాయబారం, ఎదురు కోల సంబరాలు ముగిసిన తర్వాత వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి రుక్మిణి, సత్యభామలను వివాహమాడారు. కల్యాణం ముగిసిన వెంటనే స్వామి ఉదయం సూర్యవాహనం, రాత్రి సింహవాహనాలపై గ్రామోత్సవంలో పాల్గొని భక్తులకు దర్శనం ఇచ్చారు.


ప్రత్యేక అలంకరణలో వేణుగోపాల స్వామి

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొండ మీద శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరునాళ్లను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని మూలవిరాట్ మూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని గిరిజానాథస్వామి ఆలయంలో, వేణుగోపాల స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకస్వాములు నరసింహస్వామి జయంతి సందర్భంగా నిర్వహించే తిరునాళ్ల వైభవం విశిష్టతతో పాటు నరసింహస్వామి అవతారం గురించి భక్తులకు వివరించారు. భక్తులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. విజయవాడకు చెందిన నృత్య కళాకారులతో నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. గరుడ వాహనంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. 24న స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి వారి మూలవిరాట్

లోక శాంతి కోసం గాయత్రి యజ్ఞం

గిద్దలూరు రూరల్: పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని గాయత్రి ఆలయంలో గురువారం గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో గాయత్రి యజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లోక శాంతి కోరుతూ గాయత్రి పరివార్ సభ్యులు గాయత్రి మాత ఆలయం ఆవరణలో యజ్ఞం చేశారు. యజ్ఞం చేయడంతో సకల దేవతలు సంతోషిస్తూ యావత్తు మానవాళిని రక్షిస్తాయని రామకృష్ణ ధ్యాన మందిరం నిర్వాహకులు పి.హనుమంతారెడ్డి భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మాజీ శాసన సభ్యురాలు పిడతల సాయికల్పనారెడ్డి, గాయత్రి పరివార్ సభ్యులు పాల్గొన్నారు.


యజ్ఞం చేస్తున్న భక్తులు

సమన్వయం పాటించాలి

కొనకనమిట్ల: గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సమన్వయం పాటించాలని ఎస్సై మాధవరావు సూచించారు. గురువారం మండలంలోని వద్దిమడుగు, కొత్తపల్లి, వాగుమడుగు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు శాంతి భద్రతలపై అవగాహన కలిపించారు. ఎన్నికలు ముగిశాయని, ఓట్ల లెక్కింపు రోజున కూడా ఎలాంటి గొడవలు పెట్టుకోవద్దని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అలాగే కొనకనమిట్లలో వాహనదారులకు ఎస్సై కౌన్సెలింగ్ ఇచ్చారు.


కొత్తపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్సై

వేసవి విజ్ఞాన శిబిరంతో ఉపయోగం


వేసవి విజ్ఞాన శిబిరానికి హాజరైన విద్యార్థులు

బేస్తవారిపేట: గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, చెస్, పెయింటింగ్, క్విజ్ పోటీలు, చదవడం, రాయడం, కథలు చెప్పడంపై తరగతులు నిర్వహించారు. వేసవిలో జరిగే శిక్షణ తరగతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ విద్యార్థులను వేసవి శిక్షణ తరగతులకు పంపించాలని కోరారు.

ఉచితంగా పండ్ల మొక్కలు

దొనకొండ: గ్రామాల్లోని రైతులు తమ పొలాల్లో ఈ ఏడాది పండ్ల మొక్కలు సాగు చేసుకునేందుకు వాటిని ఉచితంగా అందజేయనున్నట్లు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ టి.దేవయ్య తెలిపారు. మామిడి, జామ, నేరేడు, పైనాపిల్, ఉసిరి మొక్కలు ఉచితంగా అందజేస్తామన్నారు. ఐదెకరాల్లోపు ఉన్న రైతులు ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

దొనకొండ: ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఒంగోలు అనుసంధానంతో స్థానిక డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, హిస్టరీ, ఎకనామిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల అడ్మిన్ నానీ తెలియజేశారు. ఆసక్తి ఉన్న రెగ్యులర్, ఓపెన్ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అడ్మిషన్‌ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

యోగాతోనే ఆరోగ్యం

యర్రగొండపాలెం: యోగా, వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉండటమే కాకుండా చదువుల్లో చురుకుగా ఉంటారని గ్రంథపాలకురాలు కె.రఘూన్సీ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా గురువారం విద్యార్థులకు యోగా తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు న్యూస్, స్టోరీ రైటింగ్‌లో శిక్షణ ఇచ్చారు.

పోలీసుల మాక్ డ్రిల్


గాల్లోకి తుపాకులు ఎక్కుపెట్టిన పోలీసులు

గిద్దలూరు రూరల్: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులు చట్టరీత్యా చర్యలు ఏ విధంగా తీసుకునే అంశాలపై గురువారం స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు ఆధ్వర్యంలో పోలీసుల మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరిచేందుకు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. అల్లర్లను సృష్టించే వారిని ఎలా నివారించాలి వంటి అంశాలను పోలీసులు ప్రదర్శించారు. కార్యక్రమంలో సీఐ వైవీ సోమయ్య, ఎస్సై తోట వేంకటేశ్వర్లు, అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.